క్లుప్తంగా

కొమ్మినేని అరెస్ట్ అప్రజాస్వామికం

అద్దంకి: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఏడాది కూటమి పాలన, దుర్మార్గాలను ప్రశ్నించే వారి గొంతు నొక్కడమే ధ్యేయంగా చంద్రబాబు పనిచేస్తున్నారని ఆరోపించారు. కొమ్మినేని చేయని వ్యాఖ్యాలను ఆయనకు ఆపాదించి, కక్ష సాధిస్తున్నారన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు.

దుగ్గిరాల స్మారక మందిరం నిర్మిస్తాం



దుగ్గిరాల గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

చీరాల అర్బన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, చీరాల పేరాల ఉద్యమ నాయకులు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మారక మందిర నిర్మిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రకటించారు. మంగళవారం స్థానిక దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కులో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక రామ్‌నగర్‌లో ఆయన పేరుతో ఉన్న స్థలాన్ని సర్వే చేయించి బ్యాంకులో ఉన్న నిధులతో స్మారక మందిరాన్ని నిర్మించి వారి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విషయమై సంబంధిత కమిటీ పెద్దల సలహాలు తీసుకుంటామని తెలిపారు. కొతరపు జనార్దన్, మున్సిపల్ కౌన్సిలర్ మామిడాల రాములు, కమిటీ సమన్వయకర్త సర్విశెట్టి సుబ్బరామయ్య, కౌన్సిలర్ పి.సుబ్బయ్య, శీరాం రమేష్, భావనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ



ప్రమాద స్థలంలో తెగిపడిన విద్యుత్ తీగ

చీరాల: పట్టణ పరిధిలోని మూడు రోడ్ల సెంటర్‌లో మంగళవారం సాయంత్రం విద్యుత్ తీగ తెగిపోయి పక్కన ఉన్న కాలువలో పడింది. దీంతో స్థానికులు మీడియా దృష్టికి తీసుకురాగా స్పందించిన విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సంఘటనా స్థలానికి చేరుకుని తెగిపడిన విద్యుత్ తీగను సరిచేశారు. ప్రధాన రోడ్డు వెంబట ఉన్న విద్యుత్ తెగి ప్రక్కనే ఉన్న కాలువలో పడింది. కాలువలో కాకుండా రోడ్డుపై పడి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేది. అదే ప్రాంతంలో చిరువ్యాపారులు, చిన్నారులు ఉండడంతో భయాందోళనకు గురయ్యారు.

భవిత కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి



భవిత కేంద్రంలో చేర్పిస్తున్న సిబ్బంది

యద్దనపూడి: దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాల ద్వారా విద్య, మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ఐఈఆర్టీలు చంద్రశేఖర్, సురేఖ తెలిపారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా మండల కేంద్రమైన యద్దనపూడిలో 5గురు దివ్యాంగ విద్యార్థులను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పించారు. భవిత కేంద్రంలో ప్రతి మంగళవారం ఫిజియో థెరపీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైల్వే పాస్‌ల అందజేత

చినగంజాం: మండలంలోని దివ్యాంగులకు రైల్వే పాస్‌లను అందజేసినట్లు వెలుగు ఏపీఎం సుబ్బారావు తెలిపారు. దివ్యాంగుల సమాఖ్య సమావేశం మంగళవారం వెలుగు కార్యాలయంలో దివ్యాంగుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ రైల్లో ప్రయాణించేటువంటి దివ్యాంగులకు.. వారికి సహాయకులుగా వెళ్లే వారికి కూడా 75 శాతం రాయితీ ఇస్తామన్నారు. సమాఖ్య సభ్యులు వేణు, గ్రూపు సభ్యులు సీసీలు వెంకటస్వామి మాధవి, శ్రీలక్ష్మి అకౌంటెంట్ పద్మ, వెంకట్రావు, హనుమంతరావు చిట్టిబాబు సురేష్ పాల్గొన్నారు.



వైదన వసతి గృహం



మరమ్మతులు చేస్తున్న వసతి గృహం గదులు

పేద పిల్లలకు వరం

- తెరుచుకోనున్న వైదన వసతి గృహం
- రూ. 53 లక్షలతో పూర్తవుతున్న పనులు
- జూలై మాసాంతానికి పనులు పూర్తి చేయిస్తామని అధికారులు వెల్లడి
- అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించిన సంక్షేమ అధికారి

బల్లికురవ: పేద విద్యార్థులకు మళ్లీ మంచి రోజులు రానున్నాయి. వైదనలో ఎస్సీ బాలుర వసతి గృహంలో మళ్లీ అడ్మిషన్ల కోలాహలం ప్రారంభం అయింది. బడుగు బలహీన వర్గాలు, గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నాలుగు దశాబ్దాల క్రితం బల్లికురవ మండలంలోని వైదనలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేసింది. అయితే కాలక్రమంలో భవనాలు శిథిలావస్థకు చేరటం, టాయిలెట్లు దెబ్బ తినటం, ప్రహరీ పడిపోవడంతో తల్లిదండ్రులు భయాందోళనలో మునిగిపోయారు. రెండేళ్ల నుంచి ఈ వసతి



మరమ్మతులు పూర్తయిన టాయిలెట్స్



పూర్తయిన వంటగది

గృహంలో విద్యార్థులు చేరటంలేదు. దీనికి ముందు మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు వంద మంది విద్యార్థులకు ఇక్కడ భోజనం, వసతి, స్టడీ అవర్లు కొనసాగించేవారు. 1984లో ఏర్పాటు చేసిన ఈ వసతి గృహం మూడు దశాబ్దాల పాటు నిత్యం వందలాది మంది విద్యార్థులతో విద్యా సేవ అందించింది. ఇక్కడ విద్యార్థులు చేరేందుకు పోటీ పడేవారు. కాల క్రమంలో హాస్ట్ భవనం శిథిలావస్థ చేరి.. పైకప్పు నుంచి పెచ్చులురాలడం మొదలైంది. అలాగే సమీపంలో ఉన్న పొలాల నుంచి విష సర్పాలు సంచరిస్తుండటంతో విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాదికి తగ్గి పోతూ వచ్చింది.

మళ్లీ పూర్వ వైభవం

2023 --24 విద్యా సంవత్సరం నుంచి పూర్తిగా మూత పడింది. అయితే సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా రెండు అంచనాలతో అభివృద్ధి పనులకు రూ. 53 లక్షల నిధులను ఇటీవల మంజూరు చేశారు. ఏపీఈడబ్ల్యూఐడీసీఏ ఈఈ షేక్ హుస్సేన్ పర్యవేక్షణలో వంటగది, టాయ్‌లెట్స్ అభివృద్ధి పనులు, రన్నింగ్ వాటర్, పనులు పూర్తయ్యాయి. గదులకు సంబంధించి దెబ్బతిన్న పై కప్పును తొలగించి కప్పు వేసే పనులతో పాటు ఫ్లోరింగ్, దెబ్బతిన్న ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జూలై మాసాంతానికి పనులు పూర్తి చేయించి అప్పగిస్తామని ఏఈ తెలిపారు.

రిజర్వేషన్ ఉంది:వసతి గృహ సంక్షేమ అధికారి డి. నెహేమియా

కూకట్లపల్లి, గొర్రెపాడు, వెలమవారిపాలెం, కొత్తూరు, ఎస్.ఎల్ గుడిపాడు, కొమ్మినేని వారి పాలెం, ముక్తేశ్వరం, చెన్నుపల్లి గ్రామాల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను క్యాంపెయిన్‌లో భాగంగా కలుస్తున్నాం. ఈ వసతి గృహంలో ఎస్సీ విద్యార్థులకు 70 శాతం రిజర్వేషన్ ఉంది.మిగిలిన సీట్లు ఎస్‌టీబీసీ ఇతరులకు కేటాయిస్తామని చెప్పారు. భవనాలు, అభివృద్ధి పనులు పనులు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయి. గ్రామాల వారీగా ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులు, ఇక్కడ విద్యార్థులను చేర్పించాలని సంక్షేమ అధికారి కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న కారు

జె.పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు నుంచి జాతీయ రహదారి మీదకు వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతిని కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయలయ్యాయి. ఈ ప్రమాదం జాతీయ రహదారిపై అలవలపాడు అడ్డరోడ్డు వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. అలవలపాడు వైపు నుంచి ట్రాక్టర జాతీయ రహదారి వైపు వస్తుండగా బెంగళూరు నుంచి ఏలూరు వెళుతున్న కారు వెనుకవైపు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. కారులో ఉన్న డ్రైవర్ లక్ష్మీనారాయణ, ఏలూరుకు చెందిన రమేష్ , మరో వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

చినగంజాం: ద్విచక్ర వాహనం పై వస్తున్న ఇరువురు చిన్నారులు ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కడకుదురు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కడవకుదురు గ్రామానికి చెందిన తోటకూర నాగరాజు, ఇరువురు కుమారులు మంగళవారం వేమూరు మండలం పెరవలి గ్రామం వారి మేనమామ ఇంటి నుంచి తమ స్వగ్రామం కడవకుదురుకు వస్తున్నారు.

పెరవలికి చెందిన నాగేంద్రం అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై కడవకుదురు వస్తుండగా అతని వాహనంపై నాగరాజు కుమారులు తోటకూర సత్యనారాయణ, హరి కిరణ్‌లను అతని వెంట పంపారు. కడవకుదురు గ్రామం ఎర్ర గేటు దాటి గ్రామంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని కారు డ్రైవరు నిర్లక్ష్యంగా నడుపుతూ ద్విచక్ర వాహనంపై వస్తున్న వీరిని ఢీకొట్టాడు. తోటకూర సత్యనారాయణ, హరి కిరణ్ స్వల్ప గాయాల పాలయ్యాడు.

అర్జీల విచారణ పూర్తి చేయాలి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, రెవెన్యూ అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు తమకు కేటాయించిన విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. ప్రభుత్వ సేవలను సత్వరంగా అందించేందుకు సచివాలయాల సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. సచివాలయం ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలన్నారు. గ్రామ పంచాయతీలు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంటు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌కు వీల్ చైర్ అందజేత

చీరాల అర్బన్: చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీరాల ఆవోపా సహకారంతో మంగళవారం దివ్యాంగుల సౌకర్యార్థం చీరాల రైల్వే స్టేషన్‌కు వీల్ చైర్ అందించారు. దివ్యాంగులకు ఉపయోగకరమైన వీల్ చైర్‌ను అందించడం అభినందనీయమని రైల్వేస్టేషన్ మాస్టర్ సింగయ్య, సీహెచ్ బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, వలివేటి మురళీకృష్ణ, డీవీ సురేష్, టీఎల్ ప్రతాప్, జీవై ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ కొనుగోలు కేంద్రం ప్రారంభం



పొగాకు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి,అధికారులు

చీరాల టౌన్: మార్క్‌ఫెడ్ ద్వారా మొట్ట మొదటసారిగా చీరాల్లో బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ జె.వెంకట మురళీ ప్రారంభించారు. స్థానిక కారంచేడు రోడ్డులోని ఎఫ్‌సీఐ గోడౌన్‌లో బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతో కలిసి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. మార్క్‌ఫెడ్ ద్వారా 1.48 లక్షల క్వింటాళ్ల పొగాకును కొనుగోలు చేయడమే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా పరిధిలో బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు ఐదు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పొగాకు రైతులకు అండగా ఉండి కొనుగోళ్లు విస్తారంగా చేసేందుకు ప్రత్యేకంగా మార్క్‌ఫెడ్‌తో కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని అందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ, చేయూతనందిస్తుందన్నారు. జూన్ 16 నుంచి విస్తారంగా పొగాకు కొనుగోళ్లు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పొగాకు రైతులు అధైర్య పడవద్దన్నారు. ప్రస్తుతం క్వింటా రూ.7000కు దిగజారడంతో రైతులు నష్టపోతుండటంతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. మార్క్‌ఫెడ్ జీఎం కరుణశ్రీ, చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ కె.గోపీకృష్ణ, ఇన్‌చార్జి ఏడీఏ కె.భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ కె.జనార్దన్, తదితరులున్నారు.

పార్టీ విజయానికి పనిచేస్తాం



కృతజ్ఞతలు తెలియజేస్తున్న వివిధ విభాగాల అధ్యక్షులు

అద్దంకి: తమకు నియోజకవర్గ స్థాయి పదవులు ఇచ్చినందుకు గ్రామ గ్రామాన పార్టీ బలోపేతానికి పనిచేస్తామని ఇటీవల నియోజకవర్గ స్థాయిలో వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులుగా నియమితులైన వారు తెలిపారు. వారంతా మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పానెం చిన హనిమిరెడ్డిని కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిజేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలు కాశిదేవి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పోకమ్మ ప్రశాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జ్యోతి రోశయ్య, ప్రచార కమిటీ అధ్యక్షుడు తులుకుట్ల మురహరి యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఊడత్తు సురేశ్, బీసీ సెల్ అధ్యక్షుడు గోలి రమణబాబు, లీగల్‌సెల్ అధక్షుడు యర్రమోతు రమేశ్‌బాబు, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ మట్లపూడి బాజీ వలి, మునిసిపల్ విభాగం అధ్యక్షుడు కొత్తగొర్లసుబ్బారావు ఉన్నారు.

వైభవంగా అమ్మవారి శిడి మహోత్సవం





ప్రత్యేక అలంకరణలో కనక నాగవరపమ్మ, శిడిమహోత్సవం

వేటపాలెం: మండల పరిధిలోని రామన్నపేట శివారు పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి శిడి మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతరావూరు నుంచి తరలించిన శిడిమాను కర్రకు గల బాక్సులో శిడిపోతును ఉంచి అమ్మవారి ఆలయం చుట్టు మూడు సార్లు ప్రదర్శన చేశారు. శిడి మహోత్సవాన్ని తిలకించడాకి చుట్టు పక్కల గ్రామాలైన పందిళ్లపల్లి, కడవకుదురు, చిన్నగంజాం, జాండ్రపేట, వేటపాలెం, సంతరావూరు, చీరాల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. భక్తులు పొంగళ్ల చెల్లించి అమ్మవారికి మొక్కులు తీర్చుకొన్నారు. రైతులు వారి ఆవులు, ఎద్దులు, మేకలను అమ్మవారి గుడి చుట్టు ప్రదక్షిణ చేయించి మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో సాగర హారతి

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్ర తీరంలో హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో సాగర హారతి కార్యక్రమాన్ని బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సామూహిక సాగర హారతి కార్యక్రమాన్ని పండితుల మంత్రోచ్ఛరణల మధ్య తీరం ఒడ్డున శివునికి ప్రత్యేక పూజల అనంతరం శాస్త్రోక్తంగా సాగర హారతి నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా చాముండేశ్వరి అనుగ్రహం పీఠాధిపతులు శ్రీ కృష్ణ చాముండేశ్వర మహర్షి పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు డాక్టర్ తాడివలస దేవరాజ్, బండారు జ్వాలా మాట్లాడారు. వాడరేవు తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నిర్వహించే సామూహిక సాగర హారతిలో భాగంగా స్ఫటిక శివలింగానికి ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భజనలు మంత్రపుష్పం, సాగర హారతి నిర్వహించారు.

ప్రమాదవశాత్తు గ్రానైట్ కార్మికుడు మృతి?

మార్టూరు: ప్రమాదవశాత్తు గ్రానైట్ ఫ్యాక్టరీలో మృతి చెందిన కార్మికుడిని గుట్టు చప్పుడు కాకుండా వెలుపలికి తరలించిన సంఘటన మార్టూరులో మంగళవారం అర్ధరాత్రి వెలుగు చూసింది. స్థానిక నాగరాజు పల్లి రోడ్డు లో గల ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో ఆలయాలకు అవసరమైన స్తంభాలు, రాళ్లు ముడి రాయి నుంచి కట్ చేసి తయారు చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ గ్రానైట్ కార్మికుడు ప్రమాదవశాత్తు ముడిరాయి పైన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ఫ్యాక్టరీని ప్రస్తుతం అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్న వ్యక్తులు స్థానిక అధికారులతో అత్యంత సన్నిహితంగా ఉంటున్న కారణం చేత సదరు వ్యక్తులు విషయాన్ని బయటకు పొక్కకుండా మేనేజ్ చేసినట్లు గుసగుసలు వెలువడటం గమనార్హం. ఈ విషయం బయటకు రాకుండా చూసినందుకుగాను లక్షల రూపాయలు చేతులు మారినట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం.

నేడు వేణుగోపాలుని దివ్య రథోత్సవం

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం సాయత్రం 5 గంటలకు దివ్య రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ జీవీఎల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.15 నిమిషాలకు వేణుగోపాలస్వామి వారి రథశాల ప్రారంభోత్సవం, 11 గంటలకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, 5 గంటలకు దాత రాటకొండ హనుమంతు రావు, గ్రామస్తుల విరాళాలతో ఏర్పరుచుకున్న 35 అడుగుల దివ్యరథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

చీరాల ఎంపీడీఓ బదిలీ



చీరాల నూతన ఎంపీడీఓ శివన్నారాయణ

చీరాల టౌన్: చీరాల మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న పి.శివసుబ్రహ్మణ్యం గుంటూరుకు బదిలీ అయ్యారు. చీరాల ఎంపీడీఓగా.. ఇన్‌చార్జి డీఎల్‌పీవోగా, వేమూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న బి.శివన్నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు గుంటూరు జెడ్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు మంగళవారం అందాయి. దీంతో ఇక్కడ ఎంపీడీఓ విధుల నుంచి శివసుబ్రమణ్యం రిలీవ్ అయ్యారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

- వేగవంతంగా అభివృద్ధి పనులు

చీరాల: నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని దండుబాట సమీపంలో కృష్ణా డెల్టా పరివాహక పనులను ప్రారంభించారు. కల్వర్టుల మరమ్మతులు, పూడిక తీత పనులు, గుర్రపుడెక్క తీసివేత పనులను ప్రారంభించారు. కృష్ణానది నుంచి వచ్చే నీరు పంట కాలువల ద్వారా స్వర్ణ, ఇంకొల్లు, తిమ్మసముద్రం తదితర గ్రామాలకు సాఫీగా ప్రవహించే మార్గం దిశగా ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలానే కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని దండుబాటలో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి మంచి నీటి సరఫరా పైప్‌లైన్ పనులును పరిశీలించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

వేటపాలెం: బాల్యవివాహలను ప్రోత్సహించిన వారికి లక్ష రూపాయల జరిమానా, రెండు ఏళ్ల జైలు శిక్ష విధిస్తామని జిల్లా బాలల సంరక్షణ డీసీపీయూ డి. రాము తెలిపారు. వేటపాలెం సెక్టార్ పరిధిలో మంగళవారం కిశోర వికాసం ముగింపు కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 గురించి వివరంగా తెలియజేశారు. అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆటపాటలతో విద్యను అభ్యసించేందుకు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సజ్జా పుష్పవల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు, బుల్లెమ్మాయి, అన్నపూర్ణ, సుప్రభ, నాగేశ్వరమ్మ, ఆయాలు పాల్గొన్నారు.



వేటపాలెం: అవగాహన ర్యాలీ



జె.పంగులూరు: మానవహారంలో పాల్గొన్న సీడీపీఓ, సూపర్‌వైజర్

బాల్యవివాహాలతో నష్టం

జె.పంగులూరు: ప్రతి ఒక్కరికీ 18 సంవత్సరాల వయస్సు నిండిన తర్వాతే వివాహం జరగాలని, బాల్యవివాహాలు వారి జీవితాలకు శాపం వంటిదని ఐసీడీఎస్ కొరిశపాడు ప్రాజెక్టు సీడీపీఓ కృష్ణ కుమారి అన్నారు. కిశోర్ వికాసం కార్యక్రమంలో చివరి రోజు అయిన మంగళవారం మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించకూడదన్నారు. చిన్న వయసులో పిల్లలను కంటే ఆరోగ్యం చెడిపోవడం, జీవిత కాలం తగ్గిపోతుందని తెలిపారు. కిశోర బాలికల్లో రక్త హీనత ఎక్కువగా ఉంటుందని, దీని నుంచి బయట పడేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముప్పవరం సెక్టార్ సూపర్ వైజర్ పద్మజ మాట్లాడుతూ కిశోర బాలికలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు కిరణ్, రాజ్యలక్ష్మి, ఏఎన్‌ఎం జానకి, ఆశాలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.



యద్దన పూడిలో..

పర్చూరు (చిన్న గంజాం): ల్యవివాహాల వలన అనేక అనర్థాలు జరుగుతాయని పర్చూరు సీడీపీఓ సుభద్ర అన్నారు. బుధవారం పర్చూరు-1 అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కిశోర్ వికాసం ముగింపు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని తెలిపారు. బాలికలు ముందు శారీరకంగా మానసికంగా అభివృద్ధి చెందాలని వివరించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1098 ని వినియోగించుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ దీపిక, సంరక్షణ అధికారి శ్రీప్రియ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.